# అనుబంధానికి అర్థాలెన్నో

"రైలొత్తావుంది. అట్టా పడుకున్నావేటి? లే.... లే...." ముడుచుకుని పడుకున్న గంగుల్ని లేపింది మల్లి.

గంగులు కదలకపోవడం చూసి, తట్టి లేపుదామని వీపుమీద చెయ్యివేసిన మల్లి వెంటనే వెనక్కి తీసుకుంది చేతిని. చుర్రున కాల్తోంది ఒళ్ళు. "అయ్యో! జరవొచ్చినాది .... గంగులూ .... గంగులూ...."

"ఊ....ఊ...." మూలుగుతూ ఇటునుంచి అటు తిరిగి పడుకున్నాడు గంగులు. కంగారుగా గంగులి ముఖంలోకి చూస్తూ మళ్ళీ పిల్చింది మల్లి.

బద్దకంగా కళ్ళుతెరిచి, నీరసంగా అడిగాడు గంగులు "ఏటి? ఎంత సేపైనాది నివ్వొచ్చి."

"నా సంగతట్టావుంచు. నీ ఒల్లు పేలిపోతావుంది."

"అబ్బ...." బాధగా తల పట్టుకున్నాడు.

"తల నొప్పెడతావుందా?"

"ఊ...."

"అదిగో....రైలొత్తావుంది. నువు లేవమాక. నా నొక్కదాన్నే అడుక్కొత్తాను."

దిగేవాళ్ళని దిగనిచ్చి, ఎక్కేవాళ్ళని యెక్కించుకుని పొగలు కక్కుతూ, పెద్దగాకూసి రైలటు వెళ్ళగానే గంగులు దగ్గరకి వచ్చింది మల్లి.

"అంతా సేరి ముప్పయి పైసలయింది...." చేతిలో పైసలు లెక్క చూసుకుని చెప్పింది.

"లే....గంగులూ."

"ఎందుకూ ?" ఎటో చూస్తూ అడిగాడు.

గంగులు చూస్తున్న వైపే తన దృష్టికూడా తిప్పింది మల్లి.

తల్లి కుక్క, పిల్ల వీపుమీద ప్రేమతో నాకుతుంది.

"నా కన్నా ఆ కుక్కపిల్లది ఎంతో అదురుష్టవే మల్లీ!"

భారంగా నిట్టూర్చాడు.

"అట్టంటేనే నా కోపం....ఇప్పుడు నీ కేవయ్యిందీ! నేనే వయ్యాననంటా ? సాలుగానీ, లే...."

"ఎందుకంటే సెప్పవే!"

"ఎందుకేటి ? కాపీనీల్లు తాగుదుగాని .... నాలుగడుగు లెయ్యగలవా ? ఇక్కడికే అట్టుకొచ్చేదా ?"

"ముప్పయి పైసలేగదే వొచ్చింది. నాకోసం యిరవైపైసలు తగలెడ్డం ఎందుకు సెప్పు ?"

"సాల్లే. మాటలు నేరిశావు."

"అబ్బ! నా మాటినిపించుకో....పదిపైసలే ఇంటి కట్టుకెడితే మీ అయ్య తిట్టి పొయ్యడూ ?"

"అయితే ఏవవుద్దీ ? ఎప్పుడూ తింటానే ఉంటాగా తిట్లు. ఎట్టాగో ముప్పయిపైస లట్టుకెల్లినా "ఇంతేనా" అంటాడు. ఒక్కరోజు నీకోసం కాపీ నీల్లకి కర్చుపెడితే తప్పా ? రోజూ నేను సంపాయించిన దాంటో నీ కేవన్నా ఇచ్చేత్తన్నానా ?

"ఇయ్యా లొక్కనాడేగదా!"

.... ....

"మాటాడవేందీ ?"

"ఏటి ?"

"అయ్యకి నిన్నటినూక లింకా ఉన్నయ్ ఇయ్యాల్టికి....పద. కాపీ తాగుదుగాని"

"అబ్బ ! వొద్దు."

"కాపీనీల్లన్నా తాక్కుండా జరమ్మనిసి విట్టా పడుకుంటావా ! సోసొచ్చిపడతావ్ !" కళ్ళు పెద్దవిచేసింది మల్లి.

తప్పనిసరిగా లేచి మల్లిననుస రించాడు గంగులు.

అటు చివరున్న పాక హోటల్ దగ్గరకి దారితీశా రిద్దరూ.

కొద్దిదూరంలో చెట్టు వెనకగా నిల్చుని వాళ్ళిద్దర్నీ పరీక్షగా చూస్తున్న రాజన్న విసురుగా అక్కడినించి కదిలాడు.

కాఫీ తాగంగానే మళ్ళీ తన మామూలు స్థలానికి వేపచెట్టు కిందకి చేరాడు గంగులు.

"నాను మల్లీ ఆనకొత్తాను. వొచ్చేతప్పుడు కొత్త నూకజావట్టు కొత్తాను. నిద్రపో కుంత సేపు" ఇంటికి బయల్దేరింది మల్లి.

"కన్నోళ్లెవరూ లేరు. మల్లికూడా నేకుంటే, మల్లితో నేత్తం అయ్యుండకపోతే తన బతుకెడారిబతుకే, అట్టా కాకూడదనే గావాలు బగవంతుడు మల్లి నంపాడు...." కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి గంగులికి.

మొట్టమొదటిసారిగా మల్లి తనని పలకరించిన రోజు మనసులో మెదిలింది.

* * *

రైలెళ్ళిపోయింది.

అడుక్కోగా వచ్చిన డబ్బులు లెక్కపెట్టుకుంటూ చెట్టుకింద నిలబడ్డాడు.

వెనకగా యెవరో వచ్చి నిలబడ్డట్టు అనిపించి తిరిగి చూశాడు.

నవ్వుతూ, చురుకుగా చూస్తూ రెండు కళ్ళు పలకరించాయి.

"నా పేరు మల్లి ...."

మల్లిని చూడగానే ఎవరికైనాసరే అడుక్కునే వాళ్ళల్లో తప్పి పుట్టిందనిపిస్తుంది. కళకల ముఖం. దానికితోడు వయసు తెచ్చిన వొంపుసొంపులు....

"రోజూ నిన్ను సూత్తానే ఉంటానిక్కడ...." నేలచూపులు చూస్తూ మెల్లిగా అన్నాడు గంగులు.

"నేనూ నిన్ను గమనికసేత్తానే ఉన్నాను. ఎప్పుడూ ఇక్కడే వున్నట్టుగా అనిపిత్తావ్...." సగంలోనే ఆపేసి గంగులి కళ్ళలోకి చూసింది మల్లి.

"ఈ వేపచెట్టే నా ఇల్లు." గంగులి గొంతులో దీనత్వం, విచారం.

"అయ్యా, అమ్మా ఏడున్నారు?"

"నా కెవురూ నేరు."

"అయ్యో పాపం! అట్టాగా," సానుభూతి కురిసింది మల్లి మాటల్లో.

అంత విచారంలోనూ గంగులి మొహంలో ఆనందరేఖ ఒకటి మెరిసింది. తనతోటి ఇంతవరకూ ఎవరూ ఇంత దయగా మాటాడింది లేదు. జాలి చూపించిందిలేదు....అందుకే ఆనందంగా వుంది.

"ఈ సెట్టే నాకు తల్లి, ఇల్లు...." వేపచెట్టువంక చూస్తూ అన్నాడు.

"ఇదెవత్తో వొచ్చి ఇట్టా వాగుతున్నాదేటని నువ్వనుకోకుంటే ఓ మాట సెప్తాను. యినుకుంటావా?"

ఏవిటో చెప్పమన్నట్టుగా చూశాడు గంగులు.

"మరేంలేదు. నువ్వడుకునేతప్పుడు పాటలు పాడతావు గందా. నేను సానామాట్లు చూసినాను, నువ్వు పాడతావుంటే అందరూ మొహాల్లు సిట్లించుకోడం."

ఉలిక్కిపడ్డాడు గంగులు.

"రైల్లో అంతా యినుకోటానికి కాపోతే నువ్వు పాడే దెందుకు సెప్పు? గొంతు బావుంటే పర్వానేదు కానీ...." అవమానం గంగులి ముఖాన్ని నల్లగా మార్చింది.

ఉక్రోషం పట్టలేకపోయాడు. "పోన్లే పాట బాగానేదని తొందరగా ఎల్లిపోతాడనైనా పైసలేత్తారు."

ఇదిగో సూడు, నువ్విట్టా కోపం తెచ్చుకుంటే ఎట్టా? పోనీ ఓటి అడుగుతాను సెప్పు. ఆ ఏసేవోల్లు నీమీద ఇసుగుతో పైసలేత్తే నీకేం సుకం? ఇట్టంతో యియ్యాలగానీ పైసలు. ఆల్లనిసిగించి, కోపం తెప్పించి పైసలు రాబట్టుకోడం నాకు నచ్చదు...." తన ఉద్దేశం చెప్పింది మల్లి

మల్లిమాటలు నచ్చాయి గంగులికి.

మల్లి కళ్ళు చిలిపిగా నవ్వుతున్నాయి.

చురుకుగా చూస్తున్నాయి.

ఆ రోజు నుంచే ఇద్దరికీ మంచి స్నేహం కుదిరింది.

* * *

"మల్లీ!"

"ఊ"

"నీవల్లే తగ్గిందే నాకు జరం...." వేపచెట్టుకింద చతికిలపడుతూ అన్నాడు గంగులు.

పక్కనే కూచుంది మల్లి.

"నువ్వు నేకపోతే జరంతో సచ్చుండేవోడిని."

"అట్టాటి మాట లనమాకు. నానేదో గనకార్యం సేసినట్టు సెప్తావేటి?"

"నామీద నీ కెందుకే ఇంత దయ?"

"సాల్లే. పెద్ద పెద్ద మాటలు మాటాడమాకు."

"మీ అయ్యేవంటన్నాడు? రాజన్నతో నీకు మనువు చేత్తానంటన్నాడా?"

"ఆ .... అంటా దంటాడు. నా కిట్టంలేదని ఎన్నితడవలో సెప్పాను. ఆ రాజన్నగా దుత్త రౌడీ ఎదవ. సచ్చినా ఆడ్ని నేను మనువాడ్ను. నే నందంగా ఉంటానంట. అందికని అందరూ నాకు డబ్బులేత్తారంట. నన్ను మనువాడితే ఆడికి సంపాదన ఎక్కువవుతాదంట. అందికని ఎలాగైనాసరే నన్ను మనువాడి తీరతాడంట. ఇదీ, ఆ డిక్కడా అక్కడా కూసే కూత. నా సెవుల్దాకా వొచ్చిందిలే. అందికే ఆడంటే నాకు మా చెడ్డ రోత. సచ్చినా ఆడిని మనువాడను. రోజూ వొచ్చి కాసేపు అయ్యతో కబుర్లాడి పోతా ఉంటాడు. అయ్యకి ఆడంటే గురి. నా మా టినిపించుకోడు. సచ్చే సావుగా ఉందనుకో నాకు."

ఆలోచిస్తూంది పోయాడు గంగులు.

"నిన్న ఎంకి పుట్టి దినవంట. ఆ ల్లన్నయ్య దానికి, పుట్టినదినం బవుమతిగా రిబ్బేన్లు కొనట్టుకొచ్చాడు."

"నీ కట్టా పుట్టినదినం బవుమతి ఇచ్చేటో ల్లెవరూ లేరని ఆలోసిత్తన్నావా నేను లేనంటే?" గంగులి కళ్ళల్లోని మమకారపు కాంతులతో మల్లి కళ్ళల్లోని ఆనందం తళుక్కుమంది.

"నీ పుట్టినదిన వెప్పుడే?" కుతూహలం ఆపుకోలేని ప్రశ్న.

"సాల్లే సంబడం.... మనకి పుట్టినదినం పండగలు కూడానా?"

"అబ్బ! సెప్పమంటుంటే .... పోనీ నీకు తెలవకపోతే రేపు మీ అయ్య నడిగి సెప్పు."

"తెల్సు .... ఇదివరుకోమాటు ఏదో మాటల్లో రాజన్నతో సెప్తాఉంటే యిన్నాను."

"మరిగనేం? సెప్పు సెప్పు...."

"తెల్సుకునేం జేత్తవేంటి?"

"అబ్బబ్బ! ఏవీ చెయ్యను. ఊరికే తెల్సుకుందవని అడుగుతా ఉంటే సెప్పవేటంట?"

"పోలేరమ్మ జాతరకి అయిద్దినాల ముందు పుట్టానంట."

"బానే గుర్తున్నాదే నీకు? పోలేరమ్మ జాతర వత్తా ఉందిగా అన్నట్టు .... ఇంకొక్క పదేను దినా లున్నాది. అంటే నీ పుట్టిన దివం ఇంకొక్క పదిరోజు లున్నాదన్నమాట." ఏవేవో ఆలోచనల్లో పడ్డాడు గంగులు.

"ఇంకా పద్దినాలే ఉన్నాది.....ఈ పద్దినాల్లోనూ పైసలు కూడ బెట్టి మల్లి కేదన్నా కొనివ్వాల పుట్టిన దినంనాటికి .... ఏంకొనివ్వాల? గాజులు కొనిత్తే....బానౌను. గాజులు, రిబ్బేన్లు, పూలు కొనిత్తేసరి .... ఇయ్యాల్టినించీ ఊల్లోకీ, ఊసన్కీ తిరిగి ఎక్కువ సంపాయించాల....పైసలు కూడబెట్టాల .... ఏరోజు కారోజు తిండికి సరిపడ దొరకడవే కట్టమై పోతున్నాది....అయినాసరే బవుమతీ కొనడానికి పైసలు కూడబెట్టాలిసిందే...." ఈ ఆలోచన ఎంతో తృప్తి నిచ్చింది గంగులికి. స్థిరనిశ్చయాని కొచ్చేశాడు.

"మరి నే పోయొత్తా! చిర్రు బుర్రు లాడతాడయ్య. ఈ మద్దెన నీ పేరెత్తితేనేసాలు కస్సు మంటున్నాడు."

"ఎందుకో?"

"ఏవో? ఆ బగమంతుడికే తెలియాల. నాకు తెలవదు. ఆ రాజన్నగా దేవన్నా సెడ్డగా సెప్తున్నాదేవో, నీమీద. మా అయ్యాని కాకా పడతానికి పొద్దత్తమానం అయ్యాసుట్టూ తిరగతా ఉంటాడు."

చిన్నగా నిట్టూర్చి, మౌనంగా ఉండిపోయాడు గంగులు.

* * *

ఒక చేతిలో గాజులూ, రిబ్బన్లూ ఉన్న అట్టపెట్టె, ఇంకో చేతిలో పూలూ పట్టుకుని, ఊళ్ళోంచి అడ్డదారిన స్టేషన్‌వైపుకి తొందరగా నడుస్తూ వస్తున్నాడు గంగులు.

అడ్డొస్తున్న చెట్లసంక విసుగ్గా చూస్తూ గబగబా నడుస్తున్న గంగులి కడ్డుగా వచ్చి నిలిచాడు రాజన్న. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. తాగిన వాసన గుప్పుమంటోంది.

"ఆ గంగులుగాడితో నేత్తం అవకముందు నాతో మాటాడతానే ఉండేది మల్లి. ఆడితో నేత్తం అయినాక నావైపే సూట్టం మానేసి నాది. ఆడిని మనువాడతాని కావోలు. నన్ను కాదని ఆడిని సేసుకుంటే నాకెంత అవుమానం. ఈ అడుక్కునే టోల్లందరికి నాయకుడిలా టోడిని నేను నన్నవమానం సేయిత్తాడా ఆ గంగులుగాడు. ఆడికి బుద్ధి సెప్పందే నా పేరు రాజన్నేకాదు. మల్లి నన్ను సేసుకోపోతే సేసుకోపోయింది. ఆ గంగులుగాడిని సేసుకోటాని కసలీల్లేదు. ఆడు నాకు పరమ శత్తురువు. మల్లి మూలంగా ఆడి సంపాదన పెరిగిపోటం నా కిట్టంలేదు. ఆడిని మల్లి దాపులకే రాకుండా సూడాల. బాగా బుద్ధి సెప్పాల.'' ఇలా వందమాట్లు మనసులో వల్లెవేసుకుని బాగా మందు పట్టించి బయల్దేరాడు రాజన్న.

ఎదురుగా అడ్డుగా నిలిచిన రాజన్నవంక ఒక్క క్షణంచూసి పక్కనించి తప్పుకుని వెళ్ళిపో బోయాడు గంగులు.

"ఏయ్. ఆగు .... బయపడి పారిపోతన్నావా ? ఇదిగో జాగరగా యినుకో. యియ్యాల్టినించీ నువ్వు మల్లితో మాటాడతావి కిల్లేదు.

"నువ్వెవురట్టా సెప్పేటందుకు .... నేను మాటాడుతాను." అప్రయత్నంగానే అన్నాడు గంగులు.

ఆ జవాబు విని సహించలేకపోయాడు రాజన్న.

"నే నెవుర్నా ?'' ఒక్కసారి గర్జించి చేతిలో కర్రకి పని చెప్పాడు కోపంతో.

గంగులి నెత్తిమీద తగలరానిచోటే తగిలింది దెబ్బ.

మరుక్షణం "అబ్బా" అంటూ నేల కూలాడు.

చేతిలో గాజులు ముక్కలై చెల్లా చెదురుగా చుట్టూ పరుచుకున్నాయి.

అంత దెబ్బ తగుల్తుందని అనుకోని రాజన్న తెల్లబోయి చూశాడు. మత్తు వదిలిపోయింది.

చిన్నగా మూలిగి తల వేలాడేశాడు గంగులు.

ప్రాణం గాలిలో కలిసింది.

లేని ధైర్యం తెచ్చుకుంటూ, పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాడు రాజన్న.

పరధ్యానంగా వేపచెట్టుకింద కూర్చున్న మల్లి కనిపించింది.

రాజన్నని చూస్తూనే ముందు మొహం తిప్పేసుకుంది మల్లి. మళ్ళీ ఏమనుకుందో ఏమో "గంగులన్న ఏడన్నా నీకగుపడినాడా" అంది.

రాజన్న కళ్ళు పెద్దవయ్యాయి "గంగులన్నా ?"

"పుట్టినదిన మెప్పుడే అని పద్దినాలముందే అడిగినోడు అసలైన రోజు వొచ్చేతలికి అయిపేలేడు .... ఏడకి పోనాడో ? ఈ సెల్లెమ్మకి బవుమతీ కొనితేడానికి ఊల్లోకి పోయుంటాడు. ఈసరికి వత్తాఉంటాడు .... ఏం తెత్తన్నాడో నాకోసం ?" దూరంగా చెట్లవైపు చూస్తూ, తనకి తనే చెప్పుకుంటున్నట్టుగా అంది మల్లి

రాజన్న మొహం పాలిపోయింది.

★